క్లుప్తంగా

మార్కండేయ చల్లంగా చూడయ్యా..
– మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి



దుబ్బాక: పూజలు చేస్తున్న వనిత, భూంరెడ్డి

దుబ్బాక/హుస్నాబాద్: శివ మార్కండేయ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. సోమవారం శ్రావణ పౌర్ణమి ఉత్సవాలు పట్టణంలోని శివమార్కండేయ ఆలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన యజ్ఞంలో వనిత భూంరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయంలో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు తిరుపతి, మధు, అర్జున్ తదితరులు ఉన్నారు. హుస్నాబాద్‌లోని శివభక్త మార్కండేయ స్వామి, సహిత సీతారామ స్వామి ఆలయంలో గణపతి నవగ్రహ మంటపారాధన, గాయత్రి హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సామూహిక గాయత్రి ధారణ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పద్మశాలీలు పాల్గొన్నారు. సత్యనారాయణ, రాజయ్య, సతీశ్, వెంకటనారాయణ, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

వెండి తొడుగు సమర్పణ



వెండి తొడుగుతో వస్తున్న సంజీవరావు

హుస్నాబాద్: స్థానిక కాశీ మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతారావు కుమారుడు సంజీవరావు కుటుంబ సభ్యులు ప్రాణవటానికి వెండి తొడుగును సమర్పించారు. గతంలో శివలింగానికి 4.5కిలోలు, ప్రస్తుతం3.5 కిలోలు మొత్తం 8కిలోల వెండి తొడుగును సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు అశోక్, వీరన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల పంపిణీ



గ్రామస్తులతో నర్సింహారెడ్డి

తొగుట(దుబ్బాక): మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డి గ్రామస్తులకు సోమవారం వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వెయ్యి కుటుంబాలకు క్యాన్లు అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో కరోనా సమయంలో ప్రతి కుటుంబానికి మాస్కులు, శానిటైజర్లు, గుడ్లు పంపిణీ చేశామని, పేదలకు బియ్యం అందజేశామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఐకమత్యమే మహాభాగ్యం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

హుస్నాబాద్: ఐకమత్యమే మహాభాగ్యంగా భావించి ఇతర కాలనీ వాసులకు ఆదర్శంగా ఉండాలని శ్రీనగర్ కాలనీ వాసులు అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో సోమవారం నూతన కాలనీకి శ్రీనగర్ కాలనీగా నామకరణం చేశారు. కాలనీ అధ్యక్షుడిగా చెన్నబోయిన వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శిగా బండారి ఎల్లయ్యతోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఏ సమస్య వచ్చినా సమష్టిగా పరిష్కరించుకోవాలన్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు ప్రో కబడ్డీ క్రీడాకారుడు, కామెంటేటర్ గంగాధరి మల్లేశ్‌ను ఘనంగా సన్మానించారు.

నేడు ఎంపీ రాక

రామాయంపేట(మెదక్): ఎంపీ రఘునందన్ రావు మంగళవారం రామాయంపేట రానున్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మొదటి సారిగా రామాయంపేటకు వస్తున్న ఎంపీకి ఘనస్వాగతం పలకడానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. కృతజ్ఞత సభ పేరిట నిర్వహించే ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు.

రాఖీ అనుబంధానికి ప్రతీక

రక్షా బంధన్ వేడుకలను సోమవారం అన్ని మండలాల్లోను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు సందడి చేశారు. సోదరీ సోదరుల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగకు ఆడపడుచులు సోదరులకు రాఖీలను కట్టేందుకు తరలివచ్చారు. బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోగా రాఖీల దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఆడపడుచులు తోబుట్టువులకు రాఖీలను కట్టి ఆశీర్వచనాలను అందుకున్నారు. స్వీట్లు తినుపించుకొని అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా గజ్వేల్‌మాజీ ఎంపీపీ దాసరి అమరావతిశ్యామ్‌మనోహర్ హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్ రావుకు, గజ్వేల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డికి రాఖీలను కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు.



గజ్వేల్‌రూరల్: హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న మాజీ ఎంపీపీ అమరావతి



సిద్దిపేటజోన్: బాల సదనంలో కాంగ్రెస్ నేతలకు రాఖీలు కడుతున్న మహిళలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ నేత హరికృష్ణకు రాఖీలు కడుతున్న మహిళలు



వర్గల్(గజ్వేల్: నవోదయలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



సిద్దిపేటజోన్: మొక్కలకు రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



హుస్నాబాద్: వేడుకలు జరుపుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



హుస్నాబాద్: ముస్లిం సోదరుడు ఇంతియాజ్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత



దుబ్బాకటౌన్: ఏసీపీ మధుకు రాఖీ కడుతున్న కానిస్టేబుల్

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

హుస్నాబాద్/మిరుదొడ్డి(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ వెన్న రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భారత్ బంద్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నాయకుల తమ స్వార్థంకోసం దళితులను విడదీసి పాలించాలనే మోసపూరిత కుట్ర చేస్తున్నారన్నారు. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించి పార్లమెంట్‌లో చర్చ జరగకుండా తీర్మానం చేయడం సరికాదని చెప్పారు. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు, ఆర్టీసీ యాజమాన్యం బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాజు నాయక్, కిష్టస్వామి, రాజమౌళి, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్లు ధార స్వామి, మద్దెల రాజేశ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రాజం, సుదర్శన్, మల్లయ్య, శ్రీధర్, కుమార్, సాయి, యాదగిరి, స్వామి, కిరణ్, అంజి, అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నకోడూరులో మాల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మద్దెల నర్సింహులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మల్లేశం, సత్తయ్య, రవి, బాలయ్య, శ్రీనివాస్, దేవరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అట్రాసిటీ కేసుపై సమగ్ర విచారణ

– ఏసీపీ మధు

దుబ్బాక: పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సమగ్రంగా విచారణ చేపడుతున్నట్లు సిద్దిపేట ఏసీపీ మధు చెప్పారు. సోమవారం ఆయన పట్టణంలో పర్యటించి గత 14న పోలీసులు నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. ఓ మిఠాయి దుకాణం యజమాని, ఆయన భార్య 13న దుబ్బాక తైబజార్ వసూలుచేసే వ్యక్తిపై దాడికి యత్నించిన ఘటనలో ముగ్గురిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద బాలాజీ మిఠాయి బండార్ దుకాణం వద్ద జరిగిన ఘటనకు సంబంధించి బాధితులు బావాజీ రమేశ్‌తోపాటు ప్రత్యక్ష సాక్షులు, కేసు నమోదైన మోహన్‌లాల్, మేకు దేవి, దేవరామ్‌ల నుంచి పూర్తి వివరాలు అడిగి నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీనిపై అన్ని కోణాల్లోను విచారణ చేపడతామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ పాలెపు శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు తదితరులు ఉన్నారు.



విచారణ జరుపుతున్న ఏసీపీ మధు

పిడుగుపాటుకు ఆవు మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): పిడుగుపాటుతో పాడిఆవు మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్ పరిధిలోని ముత్తన్నపేటలో చోటు చేసుకుంది. రైతు చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేడిక కిష్టారెడ్డి సోమవారం తన పాడిఆవును మేత కోసం పొలంవద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో పిడుగుపడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని, దానిపైనే ఆధారపడి జీవిస్తున్నానని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని కోరాడు.

వేలాడుతున్న విద్యుత్ తీగ

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు భయపెడుతున్నాయి. ఓ ఇంటి వద్ద చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిలోకి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు విద్యుత్ తీగలు తాకుతున్నాయని వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్తు తీగలు సరిచేయాలని కోరుతున్నారు.



వైర్లను చూపుతున్న గ్రామస్తుడు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

– ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆయన సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా వృద్ధులకు సాయం అందించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పెళ్లి వేడుకలో గొడవ

ఇద్దరికి తీవ్రగాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): పెళ్లి వేడుకలో గొడవ చోటు చేసుకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. గౌరయపల్లి గ్రామానికి చెందిన శాకంపల్లి కరుణాకర్‌రెడ్డి తన కూతురి వివాహం అనంతరం బరాత్ జరుగుతుండగా అదే గ్రామానికి చెందిన పెద్ది మధురెడ్డి, నరెడ్ల కిరణ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి కారులో వేగంగా దూసుకువచ్చి పెండ్లి పరివారాన్ని ఢీ కొట్టారు. దీంతో వధువు తండ్రి కరుణాకర్‌రెడ్డికి గాయాలయ్యాయి. అనంతరం పెళ్లివారితో గొడవకు దిగారు. దీంతో స్థానికులు మధ్యంతాగి వాహనం ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించారు. కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పెండ్లి వారిని తిట్టి, పందిరిని కూల్చివేసి ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన శాకంపల్లి రాణిని కూడా కొట్టి గాయపర్చారు. వధువు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **అసలైన రక్షకుడు అంబేడ్కర్**

సిద్దిపేటకమాన్: మహిళలకు అసలైన రక్షకుడు అంబేడ్కర్ అని ధర్మ సమాజ్ పార్టీ మహిళా నాయకులు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు రాఖీకట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనామార్గంలో మహిళలంతా మరింత శక్తివంతంగా మారాలన్నారు. కార్యక్రమంలో పలువురు జ్యోతి, పరమేశ్వరి, ప్రసన్న, అనిత, కవిత పాల్గొన్నారు.

◆ **మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు**

బెజ్జంకి(సిద్దిపేట): సర్దార్ సర్వాయి పాపన్న స్వగ్రామం కొమ్ముగుట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయించినందుకు రాష్ట్ర బీసీ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గౌడ సంఘం సీనియర్ నాయకుడు బొనగం లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడిన పాపన్న జన్మ స్థలాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరారు.

◆ **ఘనంగా మార్కండేయ జయంతి**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్‌లో సోమవారం చేనేత సహకార సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు కొక్కుల రమేశ్ ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వేముల నరేశ్, భూమయ్య, రాయరం, ఎల్లయ్య ఉన్నారు.

◆ **'నిర్భయ'ను కఠినంగా అమలు చేయాలి**

సిద్దిపేటజోన్: నిర్భయ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బాలసదనంలో రాఖీ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణలో కేంద్రం వైఫల్యం చెందిందన్నారు. మహిళలను గౌరవించడం చిన్న తనం నుంచి పిల్లలకు నేర్పాల్సిన అవసరం ఉందని, మహిళా వైద్యులపై దారుణాలు జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, మధు, రషీద్, గయాజ్, సందీప్ పాల్గొన్నారు.

◆ **వృద్ధురాలు అదృశ్యం**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బొనగిరి కమల(60) ఆదివారం అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. ఆమె కుమారుడి కథనం ప్రకారం.. తనకు ఆరోగ్యం బాగా లేదని పెద్ద కుమార్తెకు చెప్పి ఆదివారం మధ్యాహ్నం ఆమె ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద, చుట్టు పక్కల గ్రామాల్లోను వెతికినా ఆచూకీ లభించలేదు. మతిస్థిమితం సరిగాలేదని గతంలోను ఇలానే ఒకసారి ఇంటి నుంచి వెళ్లగా వెతికి తీసుకువచ్చామని చెప్పాడు. ఆచూకీ లభిస్తే 100నంబర్‌కు గాని లేదా తన నం 9490129567కు గాని సమాచారమివ్వాలని ఏఎస్ఐ తెలిపారు.

కెమెరా మధుర జ్ఞాపకాల దొంతర



జగదేవ్‌పూర్(గజ్వేల్): డాగురే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

గజ్వేల్‌రూరల్/జగదేవ్‌పూర్(గజ్వేల్)/తొగుట(దుబ్బాక)/సిద్దిపేటజోన్: ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోకే ఉందని, వాటిని బంధించే కెమెరా మధుర జ్ఞాపకాల దొంతర అని పలువురు ఫొటోగ్రాఫర్లు పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ సభ్యులు సోమవారం గజ్వేల్ పట్టణంలో పలువురు ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి మధురజ్ఞాపకాలను బంధించడం కెమెరాకే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లను గుర్తించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, పలువురు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లో ఫొటో స్టూడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు మునీర్, మురళి, పోచయ్య, బీరప్ప, కలీమ్ తదితరులు పాల్గొన్నారు. తొగుటలో మండల జనసేన ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగు రే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాలమల్లు, మల్లేశం, నర్సింహులు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సిద్దిపేట ఫొటో భవన్‌లో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి గణేశ్, కోశాధికారి నవీన్, ప్రతినిధులు చంద్రనారాయణ, శ్రీనివాస్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఫొటోగ్రాఫర్ శ్రీనును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

● ప్రకృతి ఒడి.. సర్కారు బడి

చిన్నకోడూరు మండలం రామునిపట్ల ఉన్నత పాఠశాల ఆవరణలో అడుగు పెడితే చాలు పచ్చదనం కనువిందు చేస్తుంది. పాఠశాల ఆవరణలో ఐదేళ్ల క్రితం 300 మొక్కలు నాటారు. నాటిన మొక్కలను ఉపాధ్యాయులు, విద్యార్థులు రక్షించడంతో చెట్లుగా ఎదిగాయి. దీంతో పాఠశాల ఆవరణ మొత్తం ఇప్పుడు ఎటు చూసినా పచ్చదనంతో కళకళలాడుతూ హరితవనంగా కనిపిస్తోంది.

– చిన్నకోడూరు(సిద్దిపేట)



రామునిపట్ల పాఠశాలలో పచ్చదనం

పొదల్లోనే పంచాయతీ వాహనం

● 11 నెలల క్రితమే తరలిన కార్యాలయం
● నిరుపయోగంగా జీపు, జనరేటర్

హుస్నాబాద్‌రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కిషన్‌నగర్‌లో నిర్మించి ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లోకి 11నెలల కిందనే తరలించారు. పాత కార్యాలయ భవనాలను కూల్చి అక్కడ రైతు బజారు నిర్మిస్తున్నారు. కార్యాలయంలోని రికార్డులు ఫర్నిచర్ అంతా తరలించినా తహసీల్దార్ వినియోగించిన వాహనాన్ని మాత్రం అక్కడే వదిలేశారు. జీపు రిపేర్‌కు రావడం, డ్రైవర్ రిటైర్ కావడంతో అధికారులు దానిని మరమ్మతులు చేయించలేదు. తహసీల్దార్ తన సొంత వాహనంలోనే తిరుగడంతో గతంలో వినియోగించిన జీపు చెట్ల పొదల్లోనే వదిలేశారు. కార్యాలయ అవసరాల కోసం ఉపయోగించిన జనరేటర్‌ను కూడా అక్కడే వదిలేశారు.





నిరుపయోగంగా ఉన్న తహసీల్దార్ జీపు.. కూల్చిన కార్యాలయం వద్దే వదిలేసిన జనరేటర్

● బీరప్ప, మహంకాళి విగ్రహాలకు జలాభిషేకం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీరప్ప, మహంకాళి దేవాలయాల్లో ధ్వజస్తంభం విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కురుమ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10గంటలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివ, కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



జలాభిషేకం చేస్తున్న కురుమ సంఘం సభ్యుడు